క్లుప్తంగా

మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యం



పల్లిపాలెంలో హార్బర్ వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో చేపలు నిల్వ చేసే స్టోరేజ్ షెడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఏటా వేట విరామం సమయంలో ప్రభుత్వం ఇస్తున్న భృతి ద్వారా వారికి ఎంతో మేలు చేకూరుతోందన్నారు. మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకార ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి



సఖినేటిపల్లిలంక పాఠశాలలో ఔషధ మొక్క నాటుతున్న ప్రభావతి, సత్యనారాయణ

సఖినేటిపల్లి: ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క చొప్పున నాటి పోషించాలని సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్, ఏపీ ఎన్జీసీ కో ఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. గురువారం సదరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మలికిపురం ఎంఈవో వై.సత్యనారాయణతో కలసి ఆమె ఔషధ మొక్కలను నాటారు. పర్యావరణానికి మేలు చేకూర్చే మొక్కలు పెంపకం విధిగా చేట్టాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. హెచ్ఎం జి.మల్లికార్జునరావు, టీచర్స్ పాల్గొన్నారు.

డెకథ్లాన్‌లో రాజకుమార్‌కు రజతం



రాజకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.రాజకుమార్ ఇటీవల ఎస్‌కేవీటీ కళాశాల రాజమహేంద్రవరంలో నన్నయ యూనివర్సిటీ స్థాయిలో జరిగిన డెకథ్లాన్ పోటీల్లో గెలుపొంది ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ గురువారం తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన రాజ్‌కుమార్‌ను సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఎన్.యువరాజ్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు

రాజోలు: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాజోలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పెస్సింగి వీరబాబు, మల్లాడి కాసురాజు ప్రతిభ చూపారు. గురువారం ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్‌జీవీఎస్ ప్రసాద్, కె.శిరీషలను అభినందించారు. ఈ నెల 10 తేదీ నుంచి 12వ తేదీ వరకు నంద్యా లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో కాంస్య పతకాలు సాధించారన్నారు.

బీజామృత విత్తనశుద్ధితో లాభాలు

ఆలమూరు: బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తనాలు చల్లడం వల్ల మొలక శాతం పెరగడంతో పాటు మొక్క దృఢంగా ఎదుగుతుందని, ప్రకృతి వ్యవసాయ అధికారి కె.సూర్యప్రకాష్ రావు తెలిపారు. నర్సిపూడిలో గురువారం మండల ఏడో ఎస్.లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో రైతులకు బీజామృతం పంపిణీ జరిగింది. ఆమె మాట్లాడుతూ రైతులందరూ బీజామృతాన్ని వినియోగించుకోవడం ద్వారా వరి దుబ్బులకు తెగుళ్లను తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. అలాగే రబీ సీజన్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

సమన్వయంతో ముందుకు వెళ్తాం

మామిడికుదురు: ప్రజా సమస్యలపై సమన్వయంతో పోరాటం చేస్తామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జనసేన నేత బొంతు రాజేశ్వరరావు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన గ్రామ స్థాయి సమావేశం గురువారం మామిడికుదురులో జరిగింది. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. దీన్ని సద్వినియోగం చేసుకుని రెండు పార్టీలు ముందుకు వెళ్లాలని నిర్ణయించాయి. ఈలి శ్రీనివాస్, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, మట్టా సత్తిబాబు, వర్దినేని వెంకట్రామయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుందని, దీనిలో భాగంగా నాడు-నేడులో పాఠశాలల స్వరూపాన్ని పూర్తిగా మార్చి వేసినట్లు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం రావులపాలెం చిర్ల సోమసుందరరెడ్డినగర్‌లో నూతనంగా మంజూరైన ఎంపీపీ పాఠశాలను జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డితో కలసి ప్రారంభించారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు పథకంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం ఫేజ్-2 కొనసాగుతుందన్నారు. అలాగే రానున్న రోజుల్లో డిజిటల్ ఎడ్యుకేషన్ ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకోనుందన్నారు. దీనిలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ట్యాబ్స్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు లేని సమయంలో ప్యానల్స్ ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషితో ఇక్కడ నూతనంగా పాఠశాల ప్రారంభమైందన్నారు. స్థానిక విద్యార్థులు ఎక్కువ దూరం వెళ్లకుండా చదువుకునేందుకు వీలుగా పాఠశాలను ప్రారంభించామన్నారు. గదుల్లో ఏర్పాటు చేసిన బెంచీలను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలసి కూర్చుని వారి నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా పాఠశాల లేక ఎక్కువ దూరం విద్యార్థులు వెళ్లవలసి వస్తుందని దీనిని గుర్తించి ప్రభుత్వానికి ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరగా జిల్లా కలెక్టర్ సహకారంతో అనుమతులు వచ్చాయన్నారు. సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు నూతనంగా మంజూరైన ట్యాబులను అందజేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటసామగ్రిని మహిళలకు అందజేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. అలాగే యూటీఎఫ్ తయారు చేసిన నూతన స్టడీ మెటీరియల్స్‌ను పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, వైస్ ఎంపీపీలు బొక్కా ప్రసాద్, గన్నవరపు వెంకట్రావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈఓ శ్రీనివాసరాజు, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పి.గన్నవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని నాగుల్లంక ఫీడర్ ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. ఈ కారణంగా ఎల్.గన్నవరం, మొండెపులంక, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, పశ్చిమగోదావరి జిల్లా పుచ్చల్లంక, రాయిలంక, కనకాయలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో..

మలికిపురం: గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఈ నెల 14వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు మరమ్మతులు, చెట్లు కొమ్మల తొలగింపు పనులు చేపడతామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తూర్పుపాలెం, గొల్లపాలెం, గూడపల్లి, గూడపల్లి పల్లిపాలెం, గుబ్బలపాలెం, మామిడికుదురు మండలం కరవాక గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పౌష్టికాహారం అందించేందుకు చర్యలు

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన పౌష్టికారాన్ని పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. డిమాండ్‌ల సాధనకై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో గంగలకుర్రు పెదగరువులో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ మహాలక్ష్మి పర్యవేక్షణలో గురువారం తెరిపించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన పౌష్టికాహారం కిట్‌లు, సామగ్రి పాడైపోకుండా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పంపిణీ చేస్తామన్నారు. అందుకు గాను సచివాలయ సిబ్బందిని అంగన్‌వాడీ కేంద్రానికి ఇన్‌చార్జిగా నియమిస్తామన్నారు. కేంద్రంలో ఉన్న వస్తువులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణి, వీఆర్వో వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం మెట్లకాలనీలో సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు చిన్నారుల తల్లిదండ్రులు మద్దతుగా నిలిచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవనీయకుండా అడ్డుకున్నారు.

పంట నష్టం నమోదులో అలసత్వం వద్దు



కె.పెదపూడిలో పంట నష్టం వివరాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మంగతాయారు

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న వరి, ఉద్యాన పంటల వివరాల నమోదులో ఎటువంటి అలసత్వం వద్దని నిష్పక్షపాతంగా నమోదు చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పంట నష్టం వాటిల్లిన కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ముక్కామల, గంగలకుర్రు తదితర గ్రామాల్లో పంట నష్టంపై జరుగుతున్న సర్వేను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఏ ఒక్కరూ పంట నష్టం నమోదు చేయలేదనే రిమార్కులు లేకుండా సక్రమంగా నమోదు చేయాలన్నాను. పంట నష్టంకు వచ్చిన సర్వే అధికారులకు రైతులు సహకరించాలన్నారు. పూర్తి నష్టం, పాక్షికంగా దెబ్బతిన్న పంట వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ మణికుమార్, వీఆర్వో రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సచివాలయ సిబ్బందికి అప్పగింత

ఆలమూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు దీర్ఘకాలిక సమ్మె చేపట్టిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా ఆ బాధ్యతలను గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించినట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గ్రామాల వారీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామ సచివాలయ సిబ్బందిని నియమించే ప్రక్రియ గురువారం జరిగింది. మండలంలోని 76 అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఒక గ్రామ సచివాలయ ఉద్యోగి, ఇద్దరు వలంటీర్ల చొప్పున ఐసీడీఎస్, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖ అధికారుల బృందం నియమించింది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నియామక సిబ్బంది ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విధులు నిర్వహించాలని ఆదేశించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అయినవిల్లి: అబ్బిరెడ్డి రాందాసు ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకుడు అబ్బిరెడ్డి సురేష్ శానపల్లిలంక దేవి సెంటర్‌లో యల్లమిల్లి విజయ నేతృత్వంలో, కె.జగన్నాథపురం విజయ భేతాళ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక సంఘ సేవకులు గంగుమళ్ల శ్రీనివాస్, వల్లభ రెడ్డి వాసు, నల్లా గణేష్, నల్లా నాగు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు



మొండెపులంకలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న రాము



రాజోలులో సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



గంటిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు

కొత్తపేట: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని గంటి గ్రామంలో గురువారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సాగి బంగారాజు అధ్యక్షతన జరిగిన సభలో అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని డేవిడ్‌రాజు ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పరిధిలో లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) కింద మొత్తం సుమారు రూ.23.32 కోట్ల లబ్ధిని ఆయా పథకాల వారీగా డిస్‌ప్లే చేయగా డేవిడ్‌రాజు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు మట్టపర్తి వెంకట్రావు, ముసునూరి వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, గ్రామ కార్యదర్శి డి.వరలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పాశర్లపూడి-2 సచివాలయం పరిధిలో రూ.23.43 కోట్లు ఖర్చు చేశామని ఇంత భారీగా నిధులు ఇచ్చిన ఘనత కేవలం వైఎస్సార్ సీపీ సర్కారుకే దక్కిందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. పాశర్లపూడిబాడవ సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో రాము మాట్లాడారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. రాష్ట్రం కష్టకాలంలో ఉన్న దశలో కూడా ఎక్కడా రాజీ పడకుండా సంక్షేమ పథకాలు కొనసాగించారని గుర్తు చేశారు. రాజన్న కలలు కన్న సంక్షేమ రాజ్యం కేవలం జగన్ వల్లే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పార్టీ నేతలు వాసంశెట్టి రామకృష్ణ, గంధం మాణిక్యం, చవటపల్లి బులిబాబులు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలన అందిస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాజోలు-4 గ్రామసచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాజోలు బొడ్డపల్లి వారి గ్రూపు సెంటర్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, గ్రామశాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు, నాయకులు బందారు కాశీ, అడబాల జానకీరామ్, గోగి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొండెపులంకలో..

పి.గన్నవరం: మొండెపులంకలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం ఇంతవరకూ రూ.17 కోట్ల మేర వెచ్చించినట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. మొండెపులంకలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని చిట్టిబాబు ఆవిష్కరించారు. సర్పంచ్ గుడాల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పాటి శివకుమార్, పార్టీ నాయకులు కొల్లాటి వెంకట్రావు, కుడుపూడి రాము, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, మానుకొండ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంధిపూడిలో..

ఆలమూరు: రాష్ట్రంలోని పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌కి దేశంలో మరెవరూ సాటిలేరని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండలంలోని సంధిపూడిలో గురువారం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహసారథులు తదితరులు గ్రామ వలంటీర్లతో కలసి గ్రామంలో పర్యటించారు. గత నాలుగేన్నర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి జగనన్న ఎందుకంటే కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలంతా గ్రామ సచివాలయ కార్యాలయంలో పల్లె నిద్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలాబత్తుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగిలించిన వ్యక్తికి ఏడు నెలల జైలు

రావులపాలెం: బైక్ దొంగిలించి వ్యక్తికి ఏడు నెలల జైలు పడినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం గతేడాది డిసెంబరు 16న అరటికాయల మార్కెట్ దగ్గర దాసరి నాగరాజు తన బైక్ మెకానిక్ షెడ్ వద్ద పార్క్ చేసి ఉంచాడు. రాత్రి సమయంలో ఎవరో దొంగిలించుకుపోగా రావులపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. ఈ కేసులో ఉప్పాడ కొత్తపల్లికి చెందిన బొందపల్లి ఏసుకుమార్‌ను అరెస్టు చేసి బైక్ స్వాధీనం చేసుకొని ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. కోర్టులో నేరం అంగీకరించగా కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.భాస్కర రావు ముద్దాయికి 7 నెలలు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు

రావులపాలెం: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి పది రోజులు జైలు శిక్ష పడినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో స్థానిక హైవేపై బలరామిరెడ్డి జంక్షన్ సెంటర్లో వాహనాల తనిఖీ చేస్తుండగా, సిద్ధాంతం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న ఐషర్ వ్యాన్ డ్రైవర్ రాజమహేంద్రవరం సమీపాన కొంతమూరుకు చెందిన పోసేపు రాజు మద్యం తాగి వ్యాన్ స్పీడ్‌గా ప్రమాదకరంగా నడుపుతున్నట్టు గుర్తించి పట్టుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయగా, కొత్తపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పది రోజులు జైలు శిక్ష విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపినట్టు ఎస్సై తెలిపారు.

అన్నదాన భవనానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆత్రేయపురానికి చెందిన వి.దిలీప్ వర్మ రూ.10,116, అమలాపురానికి చెందిన ఎన్.సీతారామరాజు-అన్నపూర్ణ దంపతులు రూ.10 వేలు, గణపవరం మండలం కేశవరానికి చెందిన పి. సన్యాసిరావు రూ.10,001, బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన కె.దుర్గా వీరరాఘవరెడ్డి రూ.10 వేలు, ఆలమూరుకు చెందిన డి.నాగేశ్వర రావు రూ.10,116 విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి చిత్రపటం అందజేశారు.

ప్రతి గడపలో సంతోషం

- వెలిచేరులో గడప గడపకూ..
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వెలిచేరులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ప్రతి గడపలో చిరునవ్వులు పంచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం వెలిచేరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ కునాథరాజు రంగరాజు, న్యాయవాది పెద్దింటి వేణుగోపాల్, కునాథరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేముల రామన్న తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామంలో ప్రజలు పలు సమస్యలు ఏకరవు పెట్టారు. డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లలు తదితర సమస్యలను ఆయన మొర పెట్టుకున్నారు. ఆయన స్పందించిన ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును ప్రజలకు వివరించి సలహాలు సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో గురువారం జరిగిన పి.గన్నవరం నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశానికి సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు పాటి శివకుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి జగన్ సర్కారుకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వ లేకపోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పి కొట్టాలన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

ప్రకృతి వైపరీత్యాలను రాజకీయం చేస్తారా?

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ధ్వజం



వానపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతులు కష్టాల్లో ఉంటే అందరం వారిని ఆదుకుని ఆదరించాలే తప్ప ఈ విపత్కర పరిస్థితిని కూడా రాజకీయం చేస్తారా? అని టీడీపీ నాయకుల తీరుపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. శవాలపై డబ్బులు ఏరుకున్న చందాన ఉన్న ఆ నాయకుల వ్యవహార శైలిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. కొత్తపేట మండలం వానపల్లిలో జగ్గిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో వరి బాగా పండి దిగుబడులు ఆశాజనకంగా వస్తున్న తరుణంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 3 రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లిస్తుండగా రైతుల్లో సంతోషం వెల్లివిరిసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు ఎవరూ అతీతులు కారని, మిచాంగ్ తుపానుతో ఆ సంతోషం నిలవకుండానే రైతాంగం నష్టపోయారన్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా సీఎం జగన్ ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారులను నియమించి, కలెక్టర్లకు రూ.కోటి చొప్పున పంపించి, ఎంతో సమర్థవంతంగా నష్టం నివారణ చర్యలు తీసుకుందన్నారు. రాజకీయాలు చేయండి మాకేమీ ఇబ్బంది లేదని, రైతులు కష్టాల్లో ఉంటే ఇష్టానుసారం మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. తడిసిన, మొలకెత్తిన ప్రతీ గింజ కొంటాం అని సీఎం చెప్పారన్నారు. సంక్రాంతి లోపు పంట నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను, బాధితులను ఆదుకునే విషయంలో గతంలో ఈ రాష్ట్రంలోనే కాదు, ఈ దేశంలోనే ఏ ప్రభుత్వం చేయని విధంగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకుంటున్న జగన్ ప్రభుత్వాన్ని గాని, తమను గాని విమర్శిస్తే ప్రజల నుంచే చీత్కారం ఎదుర్కొంటారని హెచ్చరించారు.

59 మంది లబ్ధిదారులకు భూ పట్టాల పంపిణీ

సీఎం జగన్ ప్రభుత్వ దయతో ఎస్సీలతో పాటు ఆల్ క్యాస్ట్ లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు లభించిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లి ఖండ్రిగ, సుబ్బరాజుపేట సమిష్టి వ్యవసాయ సహకార సంఘంలో 59 మంది లబ్ధిదారులకు సమీప నారాయణలంకలో 34.30 ఎకరాలు జమీందారు భూమిని ఒక్కొక్కరికీ సుమారు 50 సెంట్లు చొప్పున భూ పట్టాలను బుధవారం రాత్రి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సుమారు 50 ఏళ్లుగా నలుగుతున్న ఈ భూ సమస్య పరిష్కారమైందన్నారు. ఇందుకు తనతో పాటు స్థానిక వ్యవసాయ సహకార సంఘం నాయకులు ఎంతో శ్రమించారన్నారు. గతంలో ఉన్న భూ చట్టం నిబంధనలు అనుసరించి ఏక్ సాల్ లీజు పట్టాలుగా ఇచ్చేవారని, వాటిని ఒక సంవత్సరం పాటు అనుభవించడానికే తప్ప మరే ఇతర హక్కులు ఉండేవి కాదన్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక పరిష్కారం, గమ్యం చేకూర్చి, ఈ లబ్ధిదారులను శాశ్వత భూహక్కుదారులను చేసిందన్నారు. వానపల్లిలో రక్షిత మంచినీటి సరఫరాకు సంబంధించి రూ.1.12 కోట్లతో నిర్మించే పైపు లైన్ల నిర్మాణానికి జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా కంటి ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న డీసీసీబీ పర్సన్ బండారు రాజాను జగ్గిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, వానపల్లి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయాలి

అంబాజీపేట: అసభ్య పదజాలంతో మహిళలను అవమానించడమే కాకుండా, కనీస మర్యాద కూడా ఇవ్వలేని ముక్కామల వీఆర్వో డి.పార్థసారథిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సర్పంచ్ బండారు వెంకటలక్ష్మితో పాటు స్థానిక మహిళా సంఘాలు డిమాండ్ చేశారు. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వీఆర్వో పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ఇంటి యజమానులు ఎవరూ లేని సమయంలో ఎంక్వయిరీ పేరుతో ఇళ్లకు వెళ్లి మహిళలను అగౌరవంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర దరఖాస్తులకు లంచం ఇస్తే గాని పని చేయకుండా కాలయాపన చేస్తూ మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఏ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోనని వ్యంగ్యంగా సమాధానం చెబుతున్నాడన్నారు. మహిళలపై అగౌరవంగా ప్రవర్తిస్తున్న పార్థసారథిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో, ఎస్సై ఎ.చైతన్యకుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బండారు శ్రీదేవి, రాకుర్తి సత్య, పిల్లా వెంకటలక్ష్మి, మరిడి దుర్గ, దాక శ్రీదేవి, మేడేపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.